సాక్షి నంద్యాల

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



భ్రమరాంబకు ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి సహస్రనామ పూజలు చేపట్టారు.



లిక్కర్ దొంగలపై పిడికిలి!

లిక్కర్ దొంగలపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం ప్రయోగించాలని ఏఎస్పీ నాగరాజు అధ్యక్షతన ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. 8లో▸



నేరస్తులపై నిఘా

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. నంద్యాల జిల్లాలో 1,332 మంది రౌడీషీటర్లు ఉన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను భద్రపరచాలి

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలోని ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను భద్రపరచాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన గదులలో ఎటువంటి సామగ్రి ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, స్మార్ట్ టీవీల కనెక్షన్లు తొలగించాలన్నారు. వాచ్‌మెన్ ఉన్న పాఠశాలలో భద్రతపై తగు సూచనలు తెలియజేయాలన్నారు. ట్యాబ్‌లను ఉపయోగించే విద్యార్థులు ఇంటి పని, ప్రాజెక్ట్ వర్కులను ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నిభంధరనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

కుందూకు నీరొచ్చింది



ఉయ్యాలవాడ సమీపంలో కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

ఉయ్యాలవాడ: కుందూనది అడుగంటి తీర ప్రాంత ప్రజలు అవస్థలు పడుతుండటంతో అవుకు రిజర్వాయర్ నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు. ఎండలు తీవ్ర కావడంతో దాదాపు నెల రోజులుగా నది ఎండి పోయి తాగునీటి బోర్లలో సైతం ఊట తక్కువైంది. దీంతో దాదాపు 14 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో రెండు రోజుల క్రితం అవుకు రిజర్వాయర్ నుంచి పాలేరు వాగుకు నీటిని విడుదల చేశారు. ఈ నీరు మంగళవారం కుందూకు చేరుకోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

కొనసాగుతున్న ఎండల తీవ్రత

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఎండల తీవ్రత, వడగాడ్పులకు ప్రజలు అల్లాడిపోతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉండటం ఆందోళన కలిగించే విషయం. చాగలమర్రిలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బనగానపల్లి, డోన్‌లలో 44.9, మంత్రాలయం, గోస్పాడులో 44.2 డిగ్రీలు, మహానందిలో 44.1, ఆత్మకూరులో 43.9, కోడుమూరులో 43.7 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సృజన సూచించారు.

లోక్ అదాలత్ జడ్జిగా బీఎల్‌వీ శేషాద్రి

కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా గురజాల సబ్ జడ్జిగా పనిచేస్తున్న ఆయన కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లీశ్వరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేసిన వెంకట శ్రీనివాసరావును గుంటూరు జిల్లా సత్తెనపల్లి సబ్ జడ్జిగా రాష్ట్ర హైకోర్టు బదిలీ చేసింది.

బీఎడ్ స్పెషల్ సప్లిమెంటరీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2014 కంటే ముందు బీఈడీ చదవి ఫెయిలైన వారికి స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఒక అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మే 6వ తేదీ వరకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పక్క రాష్ట్రాల్లో పోలింగ్ రోజున సెలవు

కర్నూలు(అర్బన్): కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉండి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని వాణిజ్య సంస్థలు, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్ణాటకకు చెందిన వారికి ఈ నెల 26, మే 7న, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి మే 13న వేతనంతో కూడిన సెలవు మంజూరైందన్నారు. మన రాష్ట్రంలో మే 13న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులకు సెలవును ప్రకటించారు.

- జిల్లా కేంద్రం నంద్యాలలో తాగునీటి సమస్యకు శాశ్వత చెక్
- చివరి దశకు చేరుకున్న 'అమృత ధార' పనులు
- వెలుగోడు నుంచి నంద్యాలకు 34.34 కి.మీ మేర పైప్ లైన్
- రూ.137.34 కోట్లతో ప్రాజెక్టు పనులు
- అదనంగా రూ.21.01 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



వెలుగోడు రిజర్వాయర్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాంటూన్ పంప్ హౌస్

దాహం తీరేలా.. అమృత ధార!

నంద్యాల(సిటీ): దశాబ్దాలుగా నంద్యాల పట్టణాన్ని వేధిస్తున్న మంచినీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ఇక నుంచి ప్రజలకు నీటి కష్టాలు ఉండవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో జిల్లా కేంద్రం నంద్యాల పట్టణ దాహం తీరనుంది. అమృత్ (అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ ఫార్మేషన్) పథకం కింద సెంట్రల్ పబ్లిక్ హెల్త్ (సీపీహెచ్), ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్ల నిబంధనల మేరకు ఈ ప్రాజెక్టును 98 శాతం పూర్తి చేశారు. అర్బన్ ప్రాంతాల్లో తాగు నీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నంద్యాల మున్సిపాలిటీ నిర్మిస్తున్న అతి పెద్ద పథకం ఇది. ఈ పథకం ముందుగా రూ.137.84 కోట్ల అంచనాతో నిర్మాణానికి అనుమతులు పొందగా పలు కారణాల రీత్యా మరో రూ.21.10 కోట్ల మేర నిధులు అదనంగా వెచ్చించేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అంటే గరిష్టంగా రూ.158.5 కోట్లు వెచ్చించనున్నారు. అయితే ఇప్పటికే ఈ పథకం 98 శాతం పూర్తయ్యింది, మిగిలిన రెండు శాతం మేర పనులు ఫాంటూన్ పంప్‌హౌస్ వద్ద చేసేందుకు క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ)పర్యవేక్షణలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నాణ్యతా ప్రమాణాల రీత్యా వెలుగోడు రిజర్వాయర్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో పథకాన్ని పూర్తి చేస్తున్నారు. రూ.137.34 కోట్లలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద 29.3 శాతం అంటే రూ. 40.24 కోట్లు, రాష్ట్రం వాటా 11.58 శాతం అంటే రూ.15.90 కోట్లు, యూఎల్బీ (అర్బన్ లోకల్ బాడీస్) వాటా 59.09 శాతం అంటే రూ.81.15 కోట్లు వెరసి రూ.137.84 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేయనున్నారు. రిజర్వాయర్‌లో ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్‌హౌస్‌లో పనులు పెండింగ్‌లో ఉండగా మరో నెలలోగా పనులు పూర్తి చేయనున్నారు. అయితే ఇందుకు సమాంతరంగా ప్రభుత్వం చొరవతో పట్టణానికి నీటి ఎద్దడి ఏర్పడకుండా కేసీ కెనాల్ నుంచి 15 ఎంఎల్‌డీ నీరు లిఫ్ట్ చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా పట్టణానికి అందిస్తున్నారు. ఈ విధానంతో అదనంగా రూ.41 లక్షలు మున్సిపల్ సాధారణ నిధులను వెచ్చించారు. పట్టణానికి పూర్తిగా నీటిని అందించేందుకు వివిధ రకాలుగా పైప్లైన్లను మరమ్మతులు చేసి అమృత్ పైప్ లైన్లను ఇప్పటికే సాధారణ పైప్ లైన్లకు అనుసంధానం చేశారు. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందుకు అంచనా వ్యయం రూ.137.34 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.21.10 కోట్లు వెచ్చిస్తుంది. ఈ రూ.21.10 కోట్లలో ఫ్లెక్సిబుల్ పైప్ లైన్ల నిర్మాణం కోసం రూ.8 కోట్లు ఖర్చవగా, రూ.11.81 కోట్లు జీఎస్టీ, వ్యాట్ తేడాల్లో చెల్లింపులకు వినియోగిస్తున్నారు. ఈ మొత్తాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయం.

నంద్యాల పట్టణ జనాభా	ప్రతి రోజు నీటి వినియోగం	పట్టణంలో కుళాయి కనెక్షన్లు
2.60 లక్షలు	28-30 ఎంఎల్‌డీ	31,890

అదనపు కుళాయి కనెక్షన్ల ఏర్పాటు	అమృత్ పైప్ లైన్లు డిస్ట్రిబ్యూషన్ చానల్
4,688	194 కి.మీ



వీబీఆర్ వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు

త్వరలో ట్రయల్ రన్

నంద్యాల పట్టణానికి తాగు నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన అమృత్ ప్రాజెక్టు పనులు తుది దశకు చేరుకోవడంతో త్వరలో ట్రయల్ రన్ చేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఇంజినీర్ ఇన్ చీఫ్, పబ్లిక్ హెల్త్ డిపార్టమెంట్ ఆనందరావు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనాథరెడ్డి, నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డితో కలిసి మంగళవారం వెలుగోడు రిజర్వాయర్ వద్ద అమృత్ పనులను పరిశీలించారు. వెలుగోడు నుంచి నీటిని నంద్యాల పట్టణానికి తరలించేందుకు పైప్‌లైన్లతో సులువుగా తరలించవచ్చన్నారు. అలాగే నంద్యాల మున్సిపల్ కంపోస్టుయార్డులో చేస్తున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఘన వ్యర్థాల నిర్వహణ కోసం చేస్తున్న పనుల పురోగతి పరిశీలించారు. ప్రజాప్రయోజనాల నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ఈ పనుల వల్ల ప్రజలకు మంచి జరగాలన్నారు. అదేవిధంగా సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం ద్వారా నీటిని వృథా కాకుండా రీయూజ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రమోహన్‌రావు, మున్సిపల్ ఎంఈ రమణమూర్తి, పబ్లిక్ హెల్త్ ఏఈలు, డీఈలు ఉన్నారు.

రూ.65 లక్షలతో ఫీడర్‌లైన్ ఏర్పాటు

కేసీ కెనాల్ నుంచి 15 ఎంఎల్‌డీ నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు లిఫ్ట్ చేస్తారు. ఈ నీటిని పట్టణ ప్రజలకు అందించేందుకు డెడికేటెడ్ పవర్ ఫీడర్ లైను రూ.65 లక్షలతో అధికారులు సిద్ధం చేశారు. ఈ లైన్ వల్ల విద్యుత్ కోత వల్ల వచ్చే అంతరాయాన్ని అధిగమించవచ్చు. ఈ లైన్ లేకపోతే నీరు రోజు మార్చి రోజు వస్తున్నందున ఏదైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఒక ప్రాంతానికి ఇవ్వాల్సిన నీరు 6 రోజులకు పైగా వాయిదా పడే అవకాశముంది. సమస్యను అధిగమించేలా నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో డెడికేటెడ్ ఫీడర్‌లైన్ ద్వారా ప్రజలకు నీరు అందిస్తున్నారు.

ఫాంటన్ ఫ్లాటింగ్ పంప్ హౌస్ ప్రత్యేకం

అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వెలుగోడు రిజర్వాయర్‌లో ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్ హౌస్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వెలుగోడులో నిర్మించే ఇన్ టేక్ వెల్ నిర్మాణంతో రిజర్వాయర్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనలో ఈ తరహా ప్రపోజల్ లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రిజర్వాయర్‌కు ఎటువంటి హాని జరగకుండా ఉత్తర భారతదేశంలో ఉపయోగిస్తున్న ఈ టెక్నాలజీని ఇక్కడ వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు అదనంగా రూ.41 లక్షలు నంద్యాల మున్సిపాలిటీ నిధుల నుంచి వెచ్చించారు.

ముందు చూపుతో..

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో జనాభా రోజు రోజుకూ పెరుగుతోంది. పట్టణంలో వ్యాపార, విద్య, ఇతర అవసరాల కోసం అదనంగా పల్లెల నుంచి పట్టణం బాటపడుతున్నారు. ప్రస్తుతం పట్టణ జనాభా 2.60 లక్షల మందికి కాగా మరో 30 ఏళ్ల పాటు దృష్టిలో ఉంచుకుని అమృత్ పథకాన్ని సిద్ధం చేస్తున్నారు. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని అమృత్ పథకాన్ని సిద్ధం చేస్తున్నారు. పట్టణంలో ఉన్న 25 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ ఫర్ డే) స్టోరేజ్ పంప్ హౌస్‌తో పాటు 4 ఎంఎల్‌డీ కెపాసిటీ కలిగిన ట్యాంకులు అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణంలో 31,890 కుళాయి కనెక్షన్లు ఉండగా మరో 4,688 కనెక్షన్లు అదనంగా ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పట్టణంలోని అమృత్ పైప్‌లైన్లు డిస్ట్రిబ్యూషన్ చానల్ 194 కి.మీ. మేర ఉండగా నెట్ వర్క్ పైప్లైన్ల కింద మరో 48.9 కి.మీ. మేర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

30 ఏళ్ల పాటు నీటి కొరత ఉండదు



అమృత్ పథకం ద్వారా పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నాం. త్వరలో పట్టణంలో ప్రతి ఇంటికీ పుష్కలంగా తాగునీరు అందిస్తాం. ఇప్పటికే పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించేందుకు పరిశీలిస్తున్నాం. అమృత్ సంపూర్ణంగా పూర్తయితే రానున్న 30 సంవత్సరాల పాటు పట్టణానికి నీటి కొరత ఉండదు. పట్టణానికి సమ్మర్ స్టోరేజీ నుంచి నీటిని వదులుతున్నాం. అలాగే కేసీ కెనాల్ నుంచి మరో 15 ఎంఎల్‌డీ నీరు అందిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారుగా రూ.40 కోట్ల మేర అమృత్ పథకానికి సంబంధించిన బకాయిలు చెల్లించాం.

– శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే



బుగ్గనకు బ్రహ్మరథం

ఎన్నికల ప్రచారంలో భాగంగా డోన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం బేతంచెర్ల పట్టణంలో వాడవాడలా ప్రచారం నిర్వహించగా ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు చేతపట్టి స్వాగతం పలికారు. యువత క్రేన్ల సహాయంతో గజమాలలు వేసి అభిమానం చాటారు. భిమానుల కోలాహలం మధ్య ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను కోరారు.

– బేతంచెర్ల

గోవిందా.. గోవిందా!

- కనుల పండువగా తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని రథోత్సవం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కుమ్మరులు బోనం తేగా రథం ముందు పూర్ణాహుతి ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని రథంలో ఉంచగా భక్తుల గోవిందనామం హోరెత్తగా రథాన్ని ముందుకు కదిలించారు. శ్రీమహావిష్ణువురూపుడైన శ్రీలక్ష్మీరంగనాథుడు రథంపై కొలువై విహరిస్తుండగా కనులారా తిలకించిన భక్తులు తన్మయత్వం పొందారు. ఎండలను లెక్క చేయకుండా స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు విజయ్‌భాస్కర్, ప్రకాశ్‌కుమార్, లక్ష్మీనారాయణ, నాగభూషణం, ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, జయశేఖర్ పటిష్టమైన భారీబందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ ఏడీ వెంకటరమణ, సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ రంగనాథ స్వామి



జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నంద్యాల అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పారవి. చిత్రంలో పార్టీ నేతలు



తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

ఐదవ రోజు 39 నామినేషన్లు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల: నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఐదవ రోజు మంగళవారం నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానికి నలుగురు అభ్యర్థులు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు.

➡ నంద్యాల పార్లమెంటుకు స్థానానికి స్వతంత్ర అభ్యర్థులు బి. వెంకటేశ్వర్లు, రెడ్డి పోగు విజయ భాస్కర్, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా ఉప్పు సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జె. లక్ష్మీ నరసింహ యాదవ్ నామినేషన్లు వేశారు.

➡ ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా వరికుటి హన్నమ్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బి. హుస్సేన్ బాషా (2 సెట్లు) అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చెన్నయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కే చంద్రశేఖర్ రెడ్డి, మరియదాస్, టీపీ నరసింహారావు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా శిల్పా చక్రపాణి రెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ మహమ్మద్ సికిందర్ బాషా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అజర్ సయ్యద్ ఇస్మాయిల్, స్వతంత్ర అభ్యర్థులుగా పెద్దిరెడ్డి గంగాధర్ రెడ్డి, మునగాల నాగ మల్లికార్జున రెడ్డి, ఇలియాస్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్సీపీ అభ్యర్థిగా కాటం వెంకటరమణ, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బోరెల్లి వెంకటరాముడు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా చిమ్మె వెంకటరమణ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా షాబోలు లింకన్ రాజులు నామినేషన్లు అందజేశారు.

➡ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఐ.జె. వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా యాపరాళ్ల లక్ష్మీనరసమ్మ, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా సల్లా రమేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గోపవరం గోకుల కృష్ణారెడ్డి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ అబ్బాస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ జాఫర్, ప్రజా అధికార పార్టీ అభ్యర్థిగా జి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జి స్వాతి రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా డి రామదాసు, డి రవికుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

➡ బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా గుడి చెంచుగల చెన్నయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా కేడం సుబ్బరాయుడు, గోపాజి సుబ్బరాయుడు, కాశిరెడ్డి రఘునాథరెడ్డి, గోగుల సుగుణమ్మ, పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

➡ డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా టి బాల సుబ్బయ్య, స్వతంత్ర అభ్యర్థిగా ముత్యాల శివరామయ్య ఆచారి నామినేషన్లు వేశారు.

లిక్కర్ దొంగలపై పిడికిలి!

- మద్యం అక్రమ రవాణా కట్టడికి సెబ్ విస్తృత చర్యలు
- పదేపదే నేరం చేస్తున్న ఆరుగురిపై పీడీ యాక్ట్
- 22 మందితో జిల్లా బహిష్కృతుల జాబితా సిద్ధం


పంచలింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఇటీవల పట్టుబడిన మద్యం (ఫైల్)

కర్నూలు: ఎన్నికల వేళ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు సిద్ధమవుతున్నారు. దాడుల్లో పట్టుబడినా తీరు మార్చుకోని వారికి గట్టిగా గుణపాఠం నేర్పాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టాన్ని ప్రయోగించనున్నారు. బెయిల్ కూడా దొరకని ఈ చట్టం కింద నిందితులను జైలుకు పంపే దిశగా కసరత్తు చేస్తున్నారు. అక్రమ కార్యకలాపాలు.. ముఖ్యంగా మద్యం, సారా కట్టడికి సెబ్ కృషి చేస్తోంది. ఈ విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో దాడులు విస్తృతం చేస్తున్నప్పటికీ అక్రమార్కులు మాత్రం దందా ఆపడం లేదు. పాత నేరస్తులతో పాటు గత ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారం చేసి మానుకున్నవారు సైతం పదేపదే నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో లిక్కర్ దొంగలపై పీడీ చట్టం ప్రయోగించాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు అధ్యక్షతన ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో నిర్ణయించారు.

అక్రమార్కుల జాబితా సిద్ధం..

ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 సెబ్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్తులతో పాటు మద్యం అక్రమ రవాణాకు పదేపదే పాల్పడుతున్న వారి వివరాలతో జాబితా సిద్ధమయ్యింది. గత ఆరు నెలల కాలంలో మూడుసార్లు మద్యం, సారా రవాణాలో పట్టుబడి కేసులు, నమోదైనవారి జాబితాను సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే అక్రమార్కులపై పీడీ చట్టాన్ని ప్రయోగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 6 మంది లిక్కర్ దొంగలు ఈ చట్ట పరిధిలో జైలుకు వెళ్లనున్నట్లు సమాచారం. అలాగే సారా తయారీ, రవాణాదారులపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, దాడుల్లో పట్టుబడినా తీరు మార్చుకోని వారిపై జిల్లా బహిష్కరణ వేటు వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 22 మంది జాబితాను ఉన్నతాధికారుల ఆమోదం కోసం ప్రతిపాదించినట్లు సెబ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

రూటు మార్చిన లిక్కర్ దొంగలు...

రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెరగడంతో లిక్కర్ దొంగలు రూటు మార్చి రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర మార్గాల్లో మద్యాన్ని తరలిస్తున్నట్లు సెబ్, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరింది. దీంతో చెక్‌పోస్టుల వద్ద బస్సులు, ప్రభుత్వ వాహనాల్లో కూడా తనిఖీలు ముమ్మరంగా సాగిస్తున్నారు. మద్యంతో పట్టుబడితే పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను కూడా వదలడం లేదు. పోలీసు, ఎక్సైజ్, ఆర్టీసీ, రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు పలు ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కూడా సెబ్ తనిఖీల్లో పట్టుబడి కటకటాలపాలయ్యారు. జిల్లాలో సెబ్ విభాగం పరిధిలో పనిచేసే వారితో పాటు ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్నికల ప్రత్యేక టీమ్‌లతో మద్యం డంప్‌లపై దాడులకు కార్యాచరణ రూపొందించారు.

దృష్టి మళ్లించేందుకు తప్పుడు సమాచారం...

పోలీసు,సెబ్ ఉన్నతాధికారులకు వచ్చే ఫోన్, వాట్సాప్ కాల్స్ ఆధారంగా జిల్లాలోని 13 చెక్‌పోస్టులు, మొబైల్ పార్టీలు పనిచేస్తూ లిక్కర్ దొంగల భరతం పడుతున్నారు. లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన కొందరు పలానా రూట్‌లో భారీ ఎత్తున మద్యం వస్తుందంటూ అధికారుల దృష్టిని మళ్లించేందుకు తప్పుడు సమాచారం ఇచ్చి తమ పని కానిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తరలించే అన్ని మార్గాలపైన (చెక్‌పోస్టులతో పాటు) పోలీసు, సెబ్ బృందాలు ప్రత్యేక నిఘా వేశాయి. మద్యంతో దొరికిన వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్లకు తరలిస్తున్నారు.

అనుమతి రాగానే పీడీ చట్టం ప్రయోగిస్తాం...



మద్యం అక్రమ రవాణాకు పదేపదే పాల్పడుతున్నవారు పాత నేరస్తుల వివరాలతో జాబితా సిద్ధమయ్యింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే పీడీ చట్టం ప్రయోగిస్తాం. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా తనిఖీలు ముమ్మరం చేశాం. ప్రజలు కూడా తమ వంతు సహకరించాలి. ఎక్కడైనా అక్రమ మద్యం, నాటుసారా నిల్వలు, రవాణా గుర్తిస్తే 80088 28467 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. అలాంటి వారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతాం. – ఎస్.రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్

టీడీపీ ప్రచారంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు


బీసీ జనార్దన్‌రెడ్డి పక్కన వెంకట సుబ్బసాయి అభిలాష్

కోవెలకుంట్ల: ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను తుంగలో తొక్కి ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు టీడీపీ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నాడు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన వెంకట సుబ్బసాయి అభిలాష్ వలమనేరులో అగ్రికల్చర్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, బనగానపల్లె అసెంబ్లీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాడు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారం చేస్తుండటంతో గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

మే 5 నుంచి పోస్టల్, హోం ఓటింగ్

కర్నూలు(సెంట్రల్): మే 5 నుంచి 8వ తేదీల మధ్య నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆర్వోలను ఆదేశించారు. మంగళవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఇతర జిల్లాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఫాంలను సంబంధిత జిల్లాకు పంపి పోస్టల్ బ్యాలెట్‌ను తీసుకురావాల్సి ఉంటుందని, అలాంటి బ్యాలెట్ల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంతమంది ఉన్నారో మార్కింగ్ చేయడంతోపాటు ఎన్ని బృందాలు కావాలనే విషయాన్ని తెలపాలని సూచించారు.టెలీ కాన్ఫరెన్స్‌లో పాణ్యం, కర్నూలు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివనారాయణ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళీ పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు సతీష్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: నగరూర్ గ్రామానికి చెందిన కోటి సతీష్(25) అనే యువకుడు మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు తెలిపారు. సతీష్.. హెర్బల్ కంపెనీలో పని చేసేవాడని తెలిపారు. ఆ ఉద్యోగం మానేసి, మంచి ఉద్యోగం చూసుకోవాలని తండ్రి కోటి మహానంది చెప్పడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బుడ్డావి 60-40 రాజకీయాలు


మాట్లాడుతున్న మోమిన్ అహ్మద్ హుసేన్

మహానంది: శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నీరు– చెట్టు ద్వారా రూ. 200 కోట్లు సంపాదించాడని, ఆయనవి 60–40 రాజకీయాలని మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత మోమిన్ అహ్మద్ హుసేన్ ఆరోపించారు. మహానందిలోని శాలివాహన అన్నసత్రంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. అహ్మద్ హుసేన్ మాట్లాడుతూ ఫైవ్‌స్టార్ హోటళ్లలో మందు కొట్టి డబ్బులు పంచుకునే రాజకీయాలు బుడ్డాకు సొంతమన్నారు. సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా వదిలేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డివి నైతిక విలువలతో కూడిన రాజకీయాలని కితాబిచ్చారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే శిల్పా ఎంతో కృషి చేశారన్నారు. లోకేష్ పర్యటనలో ఏరాసు ప్రతాపరెడ్డిని పక్కకు తోసి నామినేషన్‌కు ఆయనతో కలిసి వెళ్లేందుకు సిగ్గుగా లేదా అంటూ ప్రశ్నించారు. బాచం నాగేశ్వరరెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైల గిరిప్రదక్షిణ


శ్రీగిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీన్నులను చేసి అర్చకులు, పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో పల్లకీ సేవ జరిపించారు. తర్వాత స్వామిఅమ్మవార్ల పల్లకీ ఊరేగింపుతో శ్రీశైలగిరి ప్రదక్షిణకు తోడ్కొని వచ్చారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదన్, బయలు వీరభద్రస్వామి ఆలయం నుంచి రింగ్‌రోడ్డు మీదుగా గణేశ్ సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకుంది. తిరిగి నందిమండపం వద్దకు, అక్కడ నుంచి ఆలయమహాద్వారం వద్దకు గిరిప్రదక్షిణ చేరుకుంది. శ్రీశైలంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలప్రదంగా చెప్పబడుతోంది.

ఘనంగా అక్కమహాదేవి జయంత్యుత్సవం



పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ,లక్షకుంకుమార్చన పరోక్ష సేవగా నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామివారి పరమ భక్తులలో ఒకరైన శివశరణి అక్కమహాదేవి వారి జయంత్యుత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి వారికి అర్చకులు పంచామృత అభిషేకం, జలాభిషేకం తదితర విశేష పూజలు జరిపించారు. ఈ విశేష కార్యక్రమంలో ముందుగా జయంత్యోత్సవం సంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ చేశారు. అనంతరం స్తోత్రపఠనతో అక్కమహాదేవి వారిని పంచామృతాలతో, ఆలయ ప్రాంగాణంలోని మల్లికాగుండం జలంతో అభిషేకించి షోడశోపచారపూజ జరిపించారు. చివరిగా అక్కమహాదేవి వారికి పుష్పాంజలి సమర్పించారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

శ్రీశైలభ్రామరికి లక్షకుంకుమార్చన

అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన పూజలో భక్తులు పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. ఈ రోజు నిర్వహించిన పూజలో మొత్తం 25మంది భక్తులు పరోక్షసేవగా పూజ నిర్వహించుకున్నారు. పరోక్ష సేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116లు చెల్లించాల్సి ఉంటుంది.

ఆదిదంపతులకు ధూపసమర్పణ


దవనోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ


కన్నడ, మహారాష్ట్ర భక్తులు


దవనోత్సవం

శ్రీశైలంటెంపుల్: ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి రోజు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు విశేషంగా ధూపాన్ని సమర్పించడం(దవనోత్సవం) సంప్రదాయం. చైత్రపౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీశైల ఆలయం వద్ద దవనోత్సవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ రాజగోపురానికి ఎదురుగా అగ్ని ప్రతిష్ఠాపన చేసి అజ్యం, దవనం, గుగ్గిలం ఆహుతిగా వేసి స్వామిఅమ్మవార్లకు ధూపసమర్పణ చేశారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తు అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠాపనాది కార్యక్రమాలు జరిపి ధూపసమర్పణ జరిపించారు. ధూపసమర్పణ కార్యక్రమంలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు. దేవస్థాన కా ర్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఆలయ ఏఈవో హరిదాసు, ప్రధానార్చకులు శివప్రసాద్ స్వామి, ఉప ప్రధానార్చకులు శివశంకరయ్యస్వామి, పర్య వేక్షకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులపై నిఘా

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- జిల్లాలో రౌడీ షీటర్లపై పోలీసుల ఫోకస్
- పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక కౌన్సెలింగ్
- తోకజాడిస్తే బైండోవర్లు, పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌డ్ తుపాకులు అప్పగించాలని ఆదేశాలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తోంది. ఓ వైపు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. పోటీలో ఉన్న నాయకులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. రాజకీయ నాయకుల విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో జిల్లాలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. కొన్ని చోట్ల విమర్శలు శ్రుతిమించి ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటున్న సంఘటనలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా అధికారులుర పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లాలో 1,332 మంది రౌడీషీటర్లు ఉన్నారు. నేరాలు, బెదిరింపులు, హత్యలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, అక్రమ వ్యాపారాలు చేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, కిడ్నాప్‌లు చేసే వారిపై వారి నేర తీవ్రత ఆధారంగా రౌడీషీట్లు ఓపెన్ చేశారు. గతంలో వారిపై నమోదైన నేరాలు, అనుభవించిన శిక్షలు, ప్రస్తుతం వారి జీవన విధానం, ప్రవర్తనతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి హిస్టరీ షీట్‌లో పొందుపరుస్తున్నారు. గొడవలు, దాడులకు పాల్పడే అవకాశం ఉన్నవారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఏమైనా తోక జాడిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. నేర చరిత్రను వదిలేసి జీవించాలని చెబుతున్నారు. మాట వినని వారిని బైండోవర్ చేయడంతో పాటు పీడీ యాక్టు నమోదు చేసేందుకు సైతం వెనకాడడం లేదు. అలాగే ఫ్యాక్షన్ గ్రామాలపైనా నిఘా ఉంచుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి గ్రామాలలో సాయుధ బలగాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిస్తున్నారు.

తుపాకుల అప్పగింత

ఎన్నికల సమయంలో ఆత్మరక్షణ కోసం, సెక్యూరిటీ కోసం తీసుకున్న తుపాకులను పోలీసులకు అప్పగించాల్సి ఉంటుంది. లైసెన్స్ తుపాకులు కలిగిన వారు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాటిని అప్పగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 773 మంది దగ్గర 868 లైసెన్స్ తుపాకులు ఉన్నట్లు సమాచారం వీటిలో ఇప్పటివరకు 813 తుపాకులను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేశారు. మిగిలిన వాటిని రెండు, మూడు రోజుల్లో సంబంధిత పోలీసు అధికారులు డిపాజిట్ చేయించుకోనున్నారు.

బెయిల్‌పై ఉన్న వారి వివరాలు సేకరణ

జిల్లాలో నేరాలను కట్టడి చేసేందుకు, దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నారు. నేర స్వభావం మానుకోని వారిని, తరచూ నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి వారిని జైలుకు పంపిస్తున్నారు. జిల్లాలో ఎంత మంది రౌడీ షీటర్లున్నారు.. వీరిలో ఎంత మంది జైలులో ఉన్నారు.. ఎంత మంది బెయిల్‌పై బయటికి వచ్చారు అన్న సమాచారాన్ని క్రోడీకరించి బెయిల్‌పై బయట తిరుగుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్

జిల్లాలో 1,711 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 358 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలల్లో పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఇప్పటినుంచి చర్యలు ప్రారంభించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలీసు సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అక్రమాలను నివారించేలా పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ చేయనున్నారు. ఈ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని ఇప్పటికే నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపారు.

- జిల్లాలో ఉన్న రౌడీషీటర్ల సంఖ్య 1,332
- షెడ్యూల్ అనంతరం నమోదైన కేసులు 421
- బైండోవర్ చేసిన పాత నేరస్తుల సంఖ్య 2,567
- గత ఎన్నికల్లో బైండోవర్ చేసిన నేరస్తుల సంఖ్య 2,361
- జిల్లాలో లైసెన్స్ ఉన్న తుపాకుల సంఖ్య 868
- ఇప్పటివరకు సబ్మిట్ చేసిన తుపాకులు 813
- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 13,83,213
- పోలింగ్ కేంద్రాలు 1,711
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సంఖ్య 358

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



జిల్లాలో ఎన్నికలు ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పాతనేరస్తుల వివరాలను ఇప్పటికే సేకరించి ప్రత్యేక నిఘా ఉంచాం. తుపాకులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని సూచించాం. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలను చేపట్టి, డాక్యుమెంట్స్ సరిగ్గా లేని డబ్బులను సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అందజేస్తున్నాం. అలాగే ఫ్యాక్షన్ గ్రామాలలో ప్రజలకు భరోసా కల్పించేలా కవాతు చేపడుతున్నాం. జిల్లా ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.
– రఘువీర్ రెడ్డి, ఎస్పీ, నంద్యాల

248 మంది వలంటీర్ల రాజీనామాకు ఆమోదం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 248 మంది వలంటీర్ల రాజీనామాలకు ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 693 మంది వలంటీర్ల వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా..అందులో 248 మంది రాజీనామాలను ఎంపీడీఓలు ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఓర్వకల్లులో 4, కర్నూలులో 7, ఆదోనిలో 54. ఆస్పరిలో 5, కౌతాళంలో 22, హాలహర్వీలో 4, కల్లూరులో 20, మంత్రాలయంలో 64, మద్దికెరలో 2, వెల్దుర్తిలో 7, నందవరం11, పెద్దకడబూరులో 29, గోనెగండ్లలో 19 మంది వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్లు తెలిపారు.

పాఠశాలలకు వేసవి సెలవులు

- జూన్ 12న పునఃప్రారంభం

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం మంగళవారంతో ముగిసిందని పేర్కొన్నారు. బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు స్కూళ్లకు వేసవి సెలవులు ఉంటాయని తెలిపారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే ఆ స్కూల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గత నెల 18 నుంచి స్కూళ్లకు ఒంటిపూట బడులు నిర్వహించారు. చివరి రోజున అన్ని స్కూళ్లలో సంగ్రహణాత్మక పరీక్ష(సమ్మెటివ్ అసెస్‌మెంట్–2) ఫలితాలను ప్రకటించి, విద్యార్థులకు ప్రొగ్రెసివ్ కార్డులను అందజేశారు.

బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: శ్రీ సుంకుల పరమేశ్వరి జయంతి సందర్భంగా జి.వీరాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరు గ్రామానికి చెందిన సీ.నాగమల్లికార్జున రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.35 వేలు, గడివేముల మండలం కొరటమద్ది గ్రామానికి చెందిన పోతిరెడ్డి శివప్రియ ఎద్దులు రెండవ బహుమతి రూ.25వేలు గెలుచుకున్నాయి.

గుమ్మకొండ సర్పంచ్ అరెస్టు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ సర్పంచ్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు డోన్ పట్టణ పోలీసులు మంగళవారం విలేకరులకు తెలిపారు. గత నెల మార్చి 26వ తేదీన వైఎస్సార్ పార్టీ కార్యాలయం వద్ద అసభ్య పదజాలంతో పార్టీని కించపరిచేలా దుర్భాషలాడాడు. దీంతో మల్యాలకు చెందిన ఆ పార్టీ కార్యకర్త శ్రీనివాసరెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న దశరథరామిరెడ్డి మంగళవారం గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. రిమాండ్ అనంతరం బెయిల్‌పై దశరథ రామిరెడ్డి విడుదల అయ్యారు.

ఎండోస్కోపితో అత్యాధునిక వైద్యచికిత్సలు


డాక్టర్ నళినీ మోహన్ గుడాను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు


కర్నూలు(హాస్పిటల్): ఎండోస్కోపి పరికరం ద్వారా అత్యాధునిక వైద్యచికిత్సలు చేసే అవకాశాలు ఉన్నాయని అమెరికాకు చెందిన మిల్‌వాకీ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు ప్రొఫెసర్, కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ విద్యార్థి డాక్టర్ నళిని మోహన్ గుడా తెలిపారు. మంగళవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం సెమినార్ హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండోస్కోపి ద్వారా నూతన చికిత్సా విధానాలను వివరించారు. కడుపు నుంచి చిన్న పేగుకు స్టెంట్‌ను వేయడం ద్వారా ఆహారం దాని ద్వారా ఎలా వెళుతుందో తెలియజేశారు. అనంతరం ఆయనను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, వైద్యులు ఘనంగా సన్మానించారు. గతంలో ఈయన రూ.5లక్షల విలువజేసే వైద్యపరికరాలు గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి అందించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపుకట్నం వేధింపులకు వివాహిత ఆత్మహత్య


మృతురాలు విజయ

కర్నూలు: అదనపు కట్నం వేధింపుల నేపథ్యంలో నగరంలోని గణేష్ నగర్–2 లో నివాసముంటున్న పెరుమాళ్ల విజయ(23) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన విజయను కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన దాసపోగు రమేష్‌కు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. కొన్నాళ్ల క్రితం ఉపాధి నిమిత్తం వీరు కర్నూలుకు వచ్చి గణేష్ నగర్‌లో నివాసముంటున్నారు.అదనపు కట్నం కోసం భర్త రమేష్‌తో పాటు అత్త కాంతమ్మ, మామ నారాయణ కలసి విజయను మానసికంగా, శారీరకంగా వేధించారు. బాధలు భరించలేక విజయ తన ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించినా అప్పటికే మరణించింది. తండ్రి పెరుమాళ్ల నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా


గొల్లలదొడ్డిలో పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సి.బెళగల్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం ఆయన పోలకల్, గొల్లలదొడ్డి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరైనా అలజడులు సృష్టించినా, ఎన్నికల ప్రక్రియలకు విఘాతం కలుగజేసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ వెంట ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

క్లుప్తంగా

బుడ్డావి 60–40 రాజకీయాలు



మాట్లాడుతున్న మోమిన్ అహ్మద్ హుసేన్

మహానంది: శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నీరు– చెట్టు ద్వారా రూ. 200 కోట్లు సంపాదించాడని, ఆయనవి 60–40 రాజకీయాలని మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత మోమిన్ అహ్మద్ హుసేన్ ఆరోపించారు. మహానందిలోని శాలివాహన అన్నసత్రంలో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. అహ్మద్ హుసేన్ మాట్లాడుతూ ఫైవ్‌స్టార్ హోటళ్లలో మందు కొట్టి డబ్బులు పంచుకునే రాజకీ యాలు బుడ్డాకు సొంతమన్నారు. సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎమ్మెల్సీ పదవిని తృణప్రాయంగా వదిలేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డివి నైతిక విలువలతో కూడిన రాజకీయాలని కితాబిచ్చారు. ప ట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే శిల్పా ఎంతో కృషి చేశారన్నారు. లోకేష్ పర్యటనలో ఏరాసు ప్రతాపరెడ్డిని పక్కకు తోసి నామినేషన్‌కు ఆయనతో కలిసి వెళ్లేందుకు సిగ్గుగా లేదా అంటూ ప్రశ్నించారు. బాచం నాగేశ్వర రెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాల అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం తదనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ఇంటర్ విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: హోంగార్డుల పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పది, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ఎస్పీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ మంచి మార్కులు సంపాదించిన హోంగార్డుల పిల్లలకు రూ.2 వేల చొప్పున పది మందికి అందజేశామని చెప్పారు. హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ ఉన్నారు.

లిక్కర్ దొంగలపై పిడికిలి!

- మద్యం అక్రమ రవాణా కట్టడికి సెబ్ విస్తృత చర్యలు
- పదేపదే నేరం చేస్తున్న ఆరుగురిపై పీడీ యాక్ట్
- 22 మందితో జిల్లా బహిష్కృతుల జాబితా సిద్ధం

కర్నూలు: ఎన్నికల వేళ అక్రమార్కులపై ఉక్కు పాదం మోపేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు సిద్ధమవుతున్నారు. దాడుల్లో పట్టుబడినా తీరు మార్చుకోని వారికి గట్టిగా గుణపాఠం నేర్పాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టాన్ని ప్రయోగించనున్నారు. బెయిల్ కూడా దొరకని ఈ చట్టం కింద నిందితులను జైలుకు పంపే దిశగా కసరత్తు చేస్తున్నారు. అక్రమ కార్యకలాపాలు.. ముఖ్యంగా మద్యం, సారా కట్టడికి సెబ్ కృషి చేస్తోంది. ఈ విభాగం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో దాడులు విస్తృతం చేస్తున్నప్పటికీ అక్రమార్కులు మాత్రం దందా ఆపడం లేదు. పాత నేరస్తులతో పాటు గత ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారం చేసి మానుకున్నవారు సైతం పదేపదే నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో లిక్కర్ దొంగలపై పీడీ చట్టం ప్రయోగించాలని అడిషనల్ ఎస్పీ నాగరాజు అధ్యక్షతన ఎస్పీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో నిర్ణయించారు.

అక్రమార్కుల జాబితా సిద్ధం..

ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 సెబ్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్తులతో పాటు మద్యం అక్రమ రవాణాకు పదేపదే పాల్పడుతున్న వారి వివరాలతో జాబితా సిద్ధమయ్యింది. గత ఆరు నెలల కాలంలో మూడు సార్లు మద్యం, సారా రవాణాలో పట్టుబడి కేసులు, నమోదైనవారి జాబితాను సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే అక్రమార్కులపై పీడీ చట్టాన్ని ప్రయోగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 6 మంది లిక్కర్ దొంగలు ఈ చట్ట పరిధిలో జైలుకు వెళ్లనున్నట్లు సమాచారం. అలాగే సారా తయారీ, రవాణాదారులపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, దాడుల్లో పట్టుబడినా తీరు మార్చుకోని వారిపై జిల్లా బహిష్కరణ వేటు వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 22 మంది జాబితాను ఉన్నతాధికారుల ఆమోదం కోసం ప్రతిపాదించినట్లు సెబ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



పంచలింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో ఇటీవల పట్టుబడిన మద్యం (ఫైల్)

రూటు మార్చిన లిక్కర్ దొంగలు...

రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెరగడంతో లిక్కర్ దొంగలు రూటు మార్చి రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర మార్గాల్లో మద్యాన్ని తరలిస్తున్నట్లు సెబ్, పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం చేరింది. దీంతో చెక్‌పోస్టుల వద్ద బస్సులు, ప్రభుత్వ వాహనాల్లో కూడా తనిఖీలు ముమ్మరంగా సాగిస్తున్నారు. మద్యంతో పట్టుబడితే పోలీసు, ఎక్సైజ్ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను కూడా వదలడం లేదు. పోలీసు, ఎక్సైజ్, ఆర్టీసీ, రెవెన్యూ, అటవీ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు పలు ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కూడా సెబ్ తనిఖీల్లో పట్టుబడి కటకటాలపాలయ్యారు. జిల్లాలో సెబ్ విభాగం పరిధిలో పనిచేసే వారితో పాటు ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్నికల ప్రత్యేక టీమ్‌లతో మద్యం డంప్‌లపై దాడులకు కార్యాచరణ రూపొందించారు.

దృష్టి మళ్లించేందుకు తప్పుడు సమాచారం...

పోలీసు,సెబ్ ఉన్నతాధికారులకు వచ్చే ఫోన్, వాట్సాప్ కాల్స్ ఆధారంగా జిల్లాలోని 13 చెక్‌పోస్టులు, మొబైల్ పార్టీలు పనిచేస్తూ లిక్కర్ దొంగల భరతం పడుతున్నారు. లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన కొందరు ఫలానా రూట్‌లో భారీ ఎత్తున మద్యం వస్తుందంటూ అధికారుల దృష్టిని మళ్లించేందుకు తప్పుడు సమాచారం ఇచ్చి తమ పని కానిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తరలించే అన్ని మార్గాలపైన (చెక్‌పోస్టులతో పాటు) పోలీసు, సెబ్ బృందాలు ప్రత్యేక నిఘా వేశాయి. మద్యంతో దొరికిన వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్లకు తరలిస్తున్నారు.

అనుమతి రాగానే పీడీ చట్టం ప్రయోగిస్తాం...



మద్యం అక్రమ రవాణాకు పదేపదే పాల్పడుతున్నవారు పాత నేరస్తుల వివరాలతో జాబితా సిద్ధమయ్యింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే పీడీ చట్టం ప్రయోగిస్తాం. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా తనిఖీలు ముమ్మరం చేశాం. ప్రజలు కూడా తమ వంతు సహకరించాలి. ఎక్కడైనా అక్రమ మద్యం, నాటుసారా నిల్వలు, రవాణా గుర్తిస్తే 80088 28467 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. అలాంటి వారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతాం. – ఎస్.రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్

టీడీపీ ప్రచారంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు



బీసీ జనార్థన్‌రెడ్డి పక్కన వెంకటసుబ్బసాయి అభిలాష్

కోవెలకుంట్ల: ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను తుంగలో తొక్కి ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు టీడీపీ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నాడు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన వెంకట సుబ్బసాయి అభిలాష్ పలమనేరులో అగ్రికల్చర్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, బనగానపల్లె అసెంబ్లీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాడు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారం చేస్తుండటంతో గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వైభవంగా శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని వైభవంగా శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి అర్చకులు, పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో పల్లకీ సేవ జరిపించారు. తర్వాత స్వామిఅమ్మవార్ల పల్లకీ ఊరేగింపుతో శ్రీశైలగిరి ప్రదక్షిణకు తోడ్కొని వచ్చారు. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాలమ్మ ఆలయం, నందిమండపం, మల్లికార్జున సదన్, బయలు వీరభద్రస్వామి ఆలయం నుంచి రింగ్‌రోడ్డు మీదుగా గణేశ్ సదనం, సారంగధర మండపం, గోశాల, మల్లమ్మ కన్నీరు, పుష్కరిణి వద్దకు చేరుకుంది. తిరిగి నందిమండపం వద్దకు, అక్కడ నుంచి ఆలయమహాద్వారం వద్దకు గిరిప్రదక్షిణ చేరుకుంది. శ్రీశైలంలో గిరిప్రదక్షిణ చేయడం ఎంతో ఫలప్రదంగా చెప్పబడుతోంది.



శ్రీగిరిప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

నేరస్తులపై నిఘా

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- జిల్లాలో రౌడీ షీటర్లపై పోలీసుల ఫోకస్
- పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక కౌన్సెలింగ్
- తోకజాడిస్తే బైండోవర్లు, పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌డ్ తుపాకులు అప్పగించాలని ఆదేశాలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తోంది. ఓ వైపు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. పోటీలో ఉన్న నాయకులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. రాజకీయ నాయకుల విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో జిల్లాలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. కొన్ని చోట్ల విమర్శలు శ్రుతిమించి ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటున్న సంఘటనలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా అధికారులుర పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లాలో 1,332 మంది రౌడీషీటర్లు ఉన్నారు. నేరాలు, బెదిరింపులు, హత్యలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, అక్రమ వ్యాపారాలు చేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, కిడ్నాప్‌లు చేసే వారిపై వారి నేర తీవ్రత ఆధారంగా రౌడీషీట్లు ఓపెన్ చేశారు. గతంలో వారిపై నమోదైన నేరాలు, అనుభవించిన శిక్షలు, ప్రస్తుతం వారి జీవన విధానం, ప్రవర్తనతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి హిస్టరీ షీట్‌లో పొందుపరుస్తున్నారు. గొడవలు, దాడులకు పాల్పడే అవకాశం ఉన్నవారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఏమైనా తోక జాడిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. నేర చరిత్రను వదిలేసి జీవించాలని చెబుతున్నారు. మాట వినని వారిని బైండోవర్ చేయడంతో పాటు పీడీ యాక్టు నమోదు చేసేందుకు సైతం వెనకాడడం లేదు. అలాగే ఫ్యాక్షన్ గ్రామాలపైనా నిఘా ఉంచుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి గ్రామాలలో సాయుధ బలగాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిస్తున్నారు.

తుపాకుల అప్పగింత

ఎన్నికల సమయంలో ఆత్మరక్షణ కోసం, సెక్యూరిటీ కోసం తీసుకున్న తుపాకులను పోలీసులకు అప్పగించాల్సి ఉంటుంది. లైసెన్స్ తుపాకులు కలిగిన వారు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాటిని అప్పగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 773 మంది దగ్గర 868 లైసెన్స్ తుపాకులు ఉన్నట్లు సమాచారం వీటిలో ఇప్పటివరకు 813 తుపాకులను పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేశారు. మిగిలిన వాటిని రెండు, మూడు రోజుల్లో సంబంధిత పోలీసు అధికారులు డిపాజిట్ చేయించుకోనున్నారు.

బెయిల్‌పై ఉన్న వారి వివరాలు సేకరణ

జిల్లాలో నేరాలను కట్టడి చేసేందుకు, దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నారు. నేర స్వభావం మానుకోని వారిని, తరచూ నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి వారిని జైలుకు పంపిస్తున్నారు. జిల్లాలో ఎంత మంది రౌడీ షీటర్లున్నారు.. వీరిలో ఎంత మంది జైలులో ఉన్నారు.. ఎంత మంది బెయిల్‌పై బయటికి వచ్చారు అన్న సమాచారాన్ని క్రోడీకరించి బెయిల్‌పై బయట తిరుగుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్

జిల్లాలో 1,711 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 358 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలల్లో పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఇప్పటినుంచి చర్యలు ప్రారంభించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలీసు సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అక్రమాలను నివారించేలా పోలింగ్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్ చేయనున్నారు. ఈ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని ఇప్పటికే నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపారు.

- → జిల్లాలో ఉన్న రౌడీషీటర్ల సంఖ్య 1,332
- → షెడ్యూల్ అనంతరం నమోదైన కేసులు 421
- → బైండోవర్ చేసిన పాత నేరస్తుల సంఖ్య 2,567
- → గత ఎన్నికల్లో బైండోవర్ చేసిన నేరస్తుల సంఖ్య 2,361
- → జిల్లాలో లైసెన్స్ ఉన్న తుపాకుల సంఖ్య 868
- → ఇప్పటివరకు సబ్మిట్ చేసిన తుపాకులు 813
- → జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 13,83,213
- → పోలింగ్ కేంద్రాలు 1,711
- → సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సంఖ్య 358

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



జిల్లాలో ఎన్నికలు ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పాతనేరస్తుల వివరాలను ఇప్పటికే సేకరించి ప్రత్యేక నిఘా ఉంచాం. తుపాకులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని సూచించాం. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలను చేపట్టి, డాక్యుమెంట్స్ సరిగ్గా లేని డబ్బులను సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అందజేస్తున్నాం. అలాగే ఫ్యాక్షన్ గ్రామాలలో ప్రజలకు భరోసా కల్పించేలా కవాతు చేపడుతున్నాం. జిల్లా ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. – రఘువీర్ రెడ్డి, ఎస్పీ, నంద్యాల

ఘనంగా అక్కమహాదేవి జయంత్యుత్సవం





పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ, లక్షకుంకుమార్చన పరోక్ష సేవగా నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామివారి పరమ భక్తులలో ఒకరైన శివశరణి అక్కమహాదేవి వారి జయంత్యుత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి వారికి అర్చకులు పంచామృత అభిషేకం, జలాభిషేకం తదితర విశేష పూజలు జరిపించారు. ఈ విశేష కార్యక్రమంలో ముందుగా జయంత్యోత్సవం సంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ చేశారు. అనంతరం స్తోత్రపఠనతో అక్కమహాదేవి వారిని పంచామృతాలతో, ఆలయ ప్రాంగాణంలోని మల్లికాగుండం జలంతో అభిషేకించి షోడశోపచారపూజ జరిపించారు. చివరిగా అక్కమహాదేవి వారికి పుష్పాంజలి సమర్పించారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

శ్రీశైలభ్రామరికి లక్షకుంకుమార్చన

అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైలశ్రీభ్రమరాంబాదేవికి పౌర్ణమి సందర్భంగా మంగళవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. లక్షకుంకుమార్చన పూజలో భక్తులు పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. ఈ రోజు నిర్వహించిన పూజలో మొత్తం 25మంది భక్తులు పరోక్షసేవగా పూజ నిర్వహించుకున్నారు. పరోక్ష సేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116లు చెల్లించాల్సి ఉంటుంది.

ఆదిదంపతులకు ధూపసమర్పణ



దవనోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ



ఆలయం ముందు దవనోత్సవం కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమి రోజు సాయంత్రం స్వామిఅమ్మవార్లకు విశేషంగా ధూపాన్ని సమర్పించడం(దవనోత్సవం) సంప్రదాయం. చైత్రపౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీశైల ఆలయం వద్ద దవనోత్సవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ రాజగోపురానికి ఎదురుగా అగ్ని ప్రతిష్ఠాపన చేసి అజ్యం, దవనం, గుగ్గిలం ఆహుతిగా వేసి స్వామిఅమ్మవార్లకు ధూపసమర్పణ చేశారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తు అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠాపనాది కార్యక్రమాలు జరిపి ధూపసమర్పణ జరిపించారు. ధూపసమర్పణ కార్యక్రమంలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఆలయ ఏఈవో హరిదాసు, ప్రధానార్చకులు శివప్రసాద్ స్వామి, ఉప ప్రధానార్చకులు శివశంకరయ్యస్వామి, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మకొండ సర్పంచ్ అరెస్టు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ సర్పంచ్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు డోన్ పట్టణ పోలీసులు మంగళ వారం విలేకరులకు తెలిపారు. గత నెల మార్చి 26వ తేదీన వైఎస్సార్ పార్టీ కార్యాలయం వద్ద అసభ్య పదజాలంతో పార్టీని కించపరిచేలా దుర్భాషలాడాడు. దీంతో మల్యాలకు చెందిన ఆ పార్టీ కార్యకర్త శ్రీనివాసరెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న దశరథరామిరెడ్డి మంగళవారం గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. రిమాండ్ అనంతరం బెయిల్‌పై దశరథ రామిరెడ్డి విడుదల అయ్యారు.

బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: శ్రీ సుంకుల పరమేశ్వరి జయంతి సందర్భంగా జి.వీరాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. బండి ఆత్మకూరు మండలం ఎ.కోడూరు సీ.నాగమల్లికార్జున రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.35 వేలు, గడివేముల మండలం కొరటమద్దిపోతిరెడ్డి శివప్రియ ఎద్దులు రెండవ బహుమతి రూ.25వేలు గెలుచుకున్నాయి.

గడ్డివామి దగ్ధం

రుద్రవరం: మండలంలోని కే.కొత్తూరులో మంగళవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కమలమ్మ అనే మహిళా రైతు పాడి గేదెల పోషణ నిమిత్తం వరి గడ్డి కట్టలను కొనుగోలు చేసి వామిగా వేసుకుంది. పక్కనే విద్యుత్ తీగలు ఉండటంతో గాలికి రాసుకుని నిప్పులు రాలి పడటంతో ప్రమాదం సంభవించి గడ్డి మొత్తం కాలి బూడిదైంది. ఆళ్లగడ్డ అగ్ని మాపక సిబ్బంది వెళ్లి మంటలు వ్యాపించకుండా ఆర్పి వేశారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని టెక్కెలో వెలసిన నాగులకట్ట శ్రీ అభయాంజనేయ స్వామికి మంగళవారం చైత్ర మాసం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, స్నపన తిరుమంజనం, సింధూర అభిషేకం, ఆకు పూజ, వడమాలతో అలంకరించారు. స్వామి వారికి వడపప్పు, పానకాన్ని మహానైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు.

వలంటీర్ల రాజీనామా

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల గ్రామ వలంటీర్లు 20 మంది మూకుమ్మడిగా రాజీనామా పత్రాలను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగ అనసూయకు అందజేశారు. వలంటీర్లు సుబ్రహ్మణ్యం బాబు, రమేష్, అబ్దుల్, శైలజ, సుబ్బమ్మ, దివ్య మాట్లాడుతూ 23 మందిలో 20 మంది రాజీనామాలు చేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రచారం చేస్తామని తెలిపారు.

ఉయ్యాలవాడ : మండల కేంద్రానికి చెందిన గ్రామ వలంటీర్ గోపాల్ రాజీనామా చేశాడని పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి మంగళవారం తెలిపారు. అనారోగ్యం కారణంగా ఆయన రాజీనామా చేశారని, రాజీనామా పత్రం ఆమోదం కోసం ఎంపీడీఓకు పంపామని చెప్పారు.

నంద్యాల అర్బన్: మండలంలోని రాయమాల్పురం గ్రామానికి చెందిన 8 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేసి పత్రాలను పంచాయితీ కార్యదర్శి నాయక్‌కు అందజేశారు. వెంకటయ్య, మహ్మద్ రఫి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

రుద్రవరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. చిత్రేనిపల్లె–1,ఆర్.నాగులవరం –1,ఆలమూరు–1, కోటకొండ–4 రాజీనామా చేశారని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు.

టీడీపీ, జనసేనకు గుణపాఠం చెప్పాలి

నంద్యాల అర్బన్: ముస్లిం పద్ధతులు, సంస్కృతి, సంప్రదాయాలు, ముస్లిం పర్సనల్ లా బోర్డులపై పరిమితులు విధించిన బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలమూరు రఫి పిలుపునిచ్చారు. ముస్లింలు తినే ఆహారం మీద కూడా ఆంక్షలు విధించిన మోదీ విధానాలకు ఆయా పార్టీలు వత్తాసు పలకటం దారుణమన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ స్వార్థం కోసం బీజేపీతో అంటుకాగుతున్న చంద్రబాబును ముస్లింలు నమ్మవద్దన్నారు.

విద్యార్థినులకు అభినందన

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్థానిక హోలీ క్రాస్ క్యాథడ్రల్ పాఠశాల హెచ్ఎం మంజరీ హండ్ మంగళవారం అభినందించారు. అలాగే.. బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 16 మంది విద్యార్థినులు 500 పైగా మార్కులు సాధించారని హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు ప్రసాదరెడ్డి తెలిపారు.

వైభవంగా కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీ కాళికాంబ దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు దంపతుల ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్య, వరదాచార్యల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేదమంత్రాల సాక్షిగా కల్యాణ తంతు పూర్తిగావించారు. విజయ్, రమేష్, నరసింహ, దండె శ్రీను పాల్గొన్నారు.

స్ఫటిక లింగేశ్వర ఆలయంలో..



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు

చైత్రమాస పౌర్ణమిని పురస్కరించుకుని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్ఫటిక లింగేశ్వర ఆలయంలో యోగానంద స్వామి వారి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.